

బండపోతుగల్‌లో ఖాళీ బిందెలతో మహిళలు

## బండపోతుగల్‌లో తాగునీటి గోస

చిలిపిచెడ్, జూన్ 20: తాగునీటి కోసం తిప్పలుతప్పడం లేదు. మండలంలోని బండపోతుగల్, టోప్యి తండా గిరిజన తండాలో మహిళలు తాగు నీటి కోసం వ్యవసాయ బోరు బావులను ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొన్నది. తాగు నీటి కోసం గ్రామస్తులు, తండా వాసులు నానా తంటాలు పడుతున్నారు. బండపోతుగల్‌లో ఎస్సీ, ముస్లిం కాలనీలో, టోప్యి తండాలో తాగునీటి సమస్య ఏర్పడడంతో ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. బండపోతుగల్‌లో ముస్లిం కాలనీలో బక్రీద్‌కు ముందు నుంచే నీరు రావడం లేదని, అధికారులకు చెప్పినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో, తండాలో కొన్ని రోజులుగా పంచాయతీ బోరు, మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని వారు తెలిపారు. ఈ విషయంలో బండపోతుగల్ గ్రామ కార్యదర్శి ఆనంద్‌ను వివరణ కోరగా గ్రామంలో తాగు నీటి సమస్య ఉన్నది నిజమే. పంచాయతీ బోరు మోటర్ వారంలో నాలుగు సార్లు మరమ్మతులకు నోచుకోవడంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పంచాయతీలో నిధులు లేకపోవడంతో కొత్త బోరు మోటర్ కొనుగోలు చేయడం లేదన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోయి నీటి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

### 25 వరకు మహిళా డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

రామాయంపేట, జూన్ 20: డిగ్రీ కళాశాలలో ఇంటర్ పూర్తయిన విద్యార్థులు నేరుగా కళాశాలలో అడ్మిషన్లు పొందవచ్చని రామాయంపేట డిగ్రీ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ శిరీష పేర్కొన్నారు. శుక్రవారం కళాశాలలో విలేకరులతో మాట్లాడారు. రామాయంపేట పరసర ప్రాంతాల్లోని మండలాల్లో ఇంటర్ పాసైన విద్యార్థినులు తమ కళాశాలలో అడ్మిషన్ తీసుకోవాలన్నారు. ప్రభుత్వం అడ్మిషన్ల గడువు ఈనెల 25వ తేదీ వరకు పొడిగించిందని, విద్యార్థినులు తమ సర్టిఫికెట్లతో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

### గిరిజన మహిళా డిగ్రీ కళాశాలలో మూడో విడత ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ మున్సిపాలిటీ, జూన్ 20: మెదక్‌లోని గిరిజన మహిళా డిగ్రీ కళాశాలలో (బీకాం కంప్యూటర్స్ అండ్ జనరల్, బీఎస్సీ ఎంపీసీఎస్, బీఎస్సీ బీజడ్సీ, ఎంజడ్సీ (గ్రూపుల్లో) మూడో విడత ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఉమాదేవి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 25వ తేదీ వరకు గిరిజన విద్యార్థినులు మాత్రమే దోస్త్ వెబ్‌సైట్‌లో ఐడీ క్రియేట్ చేసి కళాశాలలో సంప్రదించాలని సూచించారు. అర్హులైన విద్యార్థినులకు అవకాశం ఉంటుందన్నారు. వివరాలకు 7901097706 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

### బాధిత కుటుంబాలకు కత్తి కార్తీక ఆర్థిక సాయం



తీవ్రంగా గాయపడిన పోచమ్మల రాములును పరామర్శిస్తున్న బీఆర్‌ఎస్ నాయకురాలు కత్తి కార్తీకగౌడ్

చేగుంట,జూన్20: చేగుంట, నార్సింగి మండలాల్లో బాధిత కుటుంబాలను బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకురాలు కత్తి కార్తీకగౌడ్ పరామర్శించి, వారికి ఆర్థిక సాయం అందించారు. చేగుంట మండలం వల్లభాపూర్‌కు చెందిన పోచమ్మల మరియవ్వ మృతి చెందింది. ఆమె భర్త రాములుకు తీవ్ర గాయాలయ్యాయి. నార్సింగిలోని బీఆర్‌ఎస్ సీనియర్ కార్యకర్త ఖాజీపల్లి మల్లేశ్‌యాదవ్ మనువడు మధుసూదన్ అనారోగ్యంతో మృతి చెందాడు. చేగుంటకు చెందిన అబ్దుల్ ఖయ్యూమ్ మృతి చెందాడు. ఈ బాధిత కుటుంబాలను కత్తి కార్తీకగౌడ్ శుక్రవారం పరామర్శించి, ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదల పక్షాన బీఆర్‌ఎస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. ఆమె వెంట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మైలరాం బాబు, మాజీ వైస్ ఎంపీపీ ఆకుల మల్లేశంగౌడ్, పెంటయ్య, ఎండీ ఫరీద్, జమీర్, అబ్దుల్‌రహమాన్, తిప్పనబోయిన రాజు, జంగం రాజు, భూమయ్య, ఓం ప్రకాశ్, పరుశురామ్, దుబ్బరాజాగౌడ్, కామోజీ అనురాధ ఉన్నారు.

### విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణానికి కొలతలు

చిలిపిచెడ్,జూన్ 20:మండలంలోని చండూర్ శివారులో సర్వే నెంబర్ 2లోని ఎకరం భూమిలో 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణం కోసం శుక్రవారం కొలతలు వేశారు. విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణం కోసం రూ.1.60కోట్లు మంజూరు కావడంతో జిల్లా అధికారులు వచ్చి ఉపకేంద్రం కోసం కొలతలు తీసి, నిర్మాణ పనుల కోసం ముగ్గుపోశారు. కార్యక్రమంలో జిల్లా సివిల్ ఈఈ సుకుమార్‌రెడ్డి, జిల్లా సివిల్ సబ్ ఇంజినీర్ శివకుమార్, మండల ఇన్‌చార్జి ఏఈ సల్మాన్, కాంట్రాక్టర్ అనిల్ గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

### సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు

**రామాయంపేట మండలంలో 1576 దరఖాస్తులు**

రామాయంపేట, జూన్ 20: రైతుల సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం భూ భారతి రెవెన్యూ సదస్సులను ప్రవేశపెట్టిందని తహసీల్దార్ రజినీకుమారి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని రైతు వేదికలో రెవెన్యూ సదస్సును ప్రారంభించి, రైతులకు పలు సూచనలు చేశారు. రామాయంపేట మండల వ్యాప్తంగా భూ భారతిలో ఇప్పటి వరకు 1576 దరఖాస్తులు వచ్చాయన్నారు. అందులో 910 దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేశామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారి రాజ్‌నారాయణ, ఆర్ఐ.గౌస్, ఏఈవోలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

### రెవెన్యూ సదస్సును పరిశీలించిన ఆర్డీవో

శివ్వంపేట, జూన్ 20: భూభారతిలో భాగంగా శివ్వంపేటలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో నర్సాపూర్ ఆర్డీవో మహిపాల్‌రెడ్డి సందర్శించారు. భూ సమస్యల పరిష్కారానికి రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కమలాద్రి, డిప్యూటీ తహసీల్దార్ షఫియోద్దీన్, ఆర్ఐ కిషన్ రైతులు పాల్గొన్నారు.

### భూ సమస్యల పరిష్కారానికి. .

చేగుంట, జూన్20: భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి కార్యక్రమాన్ని చేపట్టిందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శ్రీకాంత్ పేర్కొన్నారు. చేగుంటలో తహసీల్ కార్యాలయంలో భూభారతి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. భూములకు సంబంధించిన పలువురు రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ స్వప్న, ఆర్ఐలు జైభారత్‌రెడ్డి, సంతోష్‌రావు, సర్వేయర్ రవీందర్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# సమస్యలకు నిలయంగా మోడల్ స్కూల్

- సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం లాంటిది
- ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి
- ఏడుపాయల్లో ప్రత్యేక పూజలు

నర్సాపూర్, జూన్20: తెలంగాణ మోడల్ స్కూల్ సమస్యలకు నిలయంగా మారిందని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఆరోపించారు. శుక్రవారం జక్కపల్లి సమీపంలోని మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలను ఎమ్మెల్యే సందర్శించారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు. పాఠశాలలో ఉన్న సమస్యలను ఎమ్మెల్యే ఎదుట విద్యార్థులు ఏకరువు పెట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాఠశాలలో మధ్యాహ్న భోజనం సరిగ్గా లేక విద్యార్థులు ఇంటి నుంచి టిఫిన్ బాక్సులు తెచ్చుకుంటున్నారన్నారు. పాఠశాల ప్రారంభమై ఇప్పటివరకు విద్యార్థులకు యూనిఫామ్స్ రాలేవన్నారు. జూనియర్ కళాశాల విద్యార్థులు బయట కొనుక్కోవాలని సూచిస్తున్నారని మండిపడ్డారు. బస్సు సౌకర్యం లేదని విద్యార్థులు వాపోయారన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో బోరు వేసినా ఇప్పటికీ మోటర్ బిగించలేదన్నారు. మిషన్ భగీరథ నీటి సరఫరా కూడా లేదన్నారు. వసతి గృహంలో మంచాలు లేవని, విద్యార్థులు నేలపై పడుకుంటే విష పురుగులతో ప్రాణాలకు ప్రమాదం ఉందన్నారు. తరగతి గదిలో డోర్లు, కిటికీలు విరిగిపోయాయన్నారు. పాఠశాల, కళాశాలలోని సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. అనంతరం నర్సాపూర్‌లోని క్యాంప్ కార్యాలయంలో పలువురికి రూ.9,90,000 విలువ చేసే సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారు. ప్రిన్సిపాల్ ఫర్హానా, బీఆర్‌ఎస్ నాయకుడు సత్యంగౌడ్, మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, పట్టణ అధ్యక్షుడు భిక్షపతి, నాయకులు షేక్ హుస్సేన్, ప్రసాద్, ఆంజనేయులుగౌడ్, పిల్లి ఆనంద్, శివకుమార్, శ్రీనివాస్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి ఉన్నారు.



నర్సాపూర్: భోజనం ఎలా ఉందని విద్యార్థులను అడుగుతున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

### ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

జక్కపల్లిలో ఎమ్మెల్యే నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. లో ఓల్టేజ్‌తో పోచమ్మగడ్డ, కొత్తకాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారని, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయించినట్లు తెలిపారు. అదే గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు వంజరి శ్రీనివాస్ గుండెపోటుతో మృతి చెందాడు. వారి గృహానికి వెళ్లి శ్రీనివాస్ భార్య, మాజీ సర్పంచ్ వెంకటలక్ష్మిని ఎమ్మెల్యే పరామర్శించారు.

### ఏడుపాయల్లో ఎమ్మెల్యే పూజలు

పాపన్నపేట, జూన్ 20: ఏడుపాయల వన దుర్గా భవానీ మాతను ఎమ్మెల్యే శుక్రవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆమెకు వేద పండితులు ఆలయ మర్యాదల ప్రకారం స్వాగతం పలికారు. అనంతరం పూజారులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.



కౌడిపల్లి: లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

### సీఎం ఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

కౌడిపల్లి, జూన్20: పేదకు సీఎంఆర్‌ఎఫ్ వరం లాంటిదని ఎమ్మెల్యే అన్నారు. కౌడిపల్లికి చెందిన నల్లపల్లి భవ్యశ్రీకి రూ.18వేలు, పద్మశాలి మహేందర్‌కు రూ.21 వేలు, ఇందూరి నరేందర్‌కు రూ.60వేల చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు దుర్గారెడ్డి, అల్మాయిపేట ఎల్లం, ప్రతాప్‌గౌడ్, పోల నవీన్, సందీప్, సంగప్ప పాల్గొన్నారు.



పాపన్నపేట: అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే

# పట్టణ ప్రజలు ఇబ్బందులు పట్టించుకోరా

**మున్సిపల్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసిన మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి**

మెదక్ మున్సిపాలిటీ, జూన్20: జిల్లా కేంద్రంలో నాలుగు రోజులు మిషన్ భగీరథ నీటి సరఫరా కాకపోవడంతో పట్టణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోరా అని మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. శుక్రవారం మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, మాజీ కౌన్సిలర్లు ఆంజనేయులు, శ్రీనివాస్, మల్లేశం, జయరాజ్, విశ్వం, కిశోర్, నాయకులు జుబేర్ అహ్మద్, జగదీశ్, వేణు తదితరులతో కలిసి అదనపు కలెక్టర్ నగేశ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భగీరథ నీరు సరఫరా అయ్యే పైపులైన్‌లో అంతరాయం ఏర్పడితే మున్సిపల్ అధికారులు మరమ్మతులు చేపట్టడం లేదన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన మిషన్ భగీరథ పథకంపై పర్యవేక్షణ కరువైందన్నారు. భగీరథకు సంబంధించి గ్రిడ్ అధికారులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. పైపులైన్ మరమ్మతులు నాలుగు రోజులుగా కొనసాగడంపై అధికారుల సమన్వయ లోపం కనిపిస్తుందన్నారు. ఈ విషయంలో అధికార ప్రజాప్రతినిధులు సైతం పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. శనివారంలోగా మరమ్మతులు పూర్తి చేసి నీరందించక పోతే బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ధర్నా చేస్తామని హెచ్చరించారు.

### బోనాల ఉత్సవంలో పద్మాదేవేందర్‌రెడ్డి

మెదక్‌లో నిర్వహించిన ముత్యాలమ్మ బోనాల్లో మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, మాజీ కౌన్సిలర్లు యశోద కృష్ణాగౌడ్, ఆంజనేయులు, కిశోర్, జయరాజ్, శ్రీనివాస్, విశ్వం, బీఆర్‌ఎస్ నేతలు లింగారెడ్డి, ప్రభురెడ్డి, జుబేద్, మధు, వేణు, రంజిత్, లడ్డు తదితరులు పాల్గొన్నారు.



అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నేతలు

# నార్కోటిక్స్ పదార్థాల నియంత్రణకు చర్యలు

- మత్తు పదార్థాలు సమాజాన్ని భ్రష్టు పట్టించకుండా చర్యలు
- గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య
- కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్, జూన్ 20 (నమస్తే తెలంగాణ): మత్తు పదార్థాలు సమాజాన్ని భ్రష్టు పట్టించకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో నార్కోటిక్స్ (మత్తు) పదార్థాల నియంత్రణపై తీసుకుంటున్న చర్యలను సమావేశంలో సెక్రటరీ డిస్టిక్ లీగల్ సర్వీస్ అథారిటీ ఆర్ఎం శుభవల్లి, అదనపు కలెక్టర్ నగేశ్‌తో కలిసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మత్తు పదార్థాల అక్రమ రవాణాపై నిఘా పెంచాలని, అనుమానిత ప్రదేశాల్లో తనిఖీలు చేపట్టాలని పోలీస్ అధికారులకు ఆదేశించారు. పాఠశాలలో, కళాశాలల్లో మాదకద్రవ్యాలపై కార్యకలాపాలు చేపట్టి యువతకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. దివ్యాంగులు, సీనియర్ సిటిజన్లు, లింగమార్పిడి వ్యక్తుల సాధికారత శాఖ మిషన్ పరివర్తన కార్యక్రమాన్ని ప్రారంభించిందని, ఎన్ఎంబీఏ కింద అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్, జిల్లా సంక్షేమ అధికారి హైమావతి, ఎస్సీ కార్పొరేషన్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి శ్రీరామ్, డీఈఓ రాధా కిషన్, సంబంధిత ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య

మెదక్ మున్సిపాలిటీ, జూన్ 20: బెస్ట్ అవైలబుల్ పాఠశాల ద్వారా గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య అవకాశాలు ఉన్నాయని కలెక్టర్ అన్నారు. కలెక్టరేట్‌లో ఈ విద్యా సంవత్సరానికి బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకం కింద 3, 5, 8 తరగతుల్లో గిరిజన విద్యార్థుల ప్రవేశాలకు అదనపు కలెక్టర్ నగేశ్, జిల్లా గిరిజన సంక్షేమ అధికారిణి నీలిమ, దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు తల్లిదండ్రుల సమక్షంలో లక్కీ డ్రా ద్వారా సీట్లు కేటాయించారు.

### ఆగస్టు 15లోగా భూసమస్యలను పరిష్కరిస్తాం

చిన్నశంకరంపేట, జూన్ 30: భూభారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను ఆగస్టు 15లోగా పరిశీలించి, పరిష్కరిస్తామని కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. మడూరులో నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సును సందర్శించారు. దరఖాస్తులను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ భూసమస్యలను పరిష్కరించడం కోసమే ప్రభుత్వం భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందన్నారు. జడ్పీహెచ్ఎస్‌లో ఆకస్మికంగా తనిఖీ చేశారు.విద్యతోనే సమాజ అభివృద్ధి సాధ్యపడుతుందని కలెక్టర్ సూచించారు. పాఠశాలలోని తరగతి గదులను పరిశీలించారు. నోట్‌బుక్స్, డ్రెస్సు అందించారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

# స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ తప్పనిసరి

అల్లాదుర్గం, జూన్ 20: ప్రైవేట్ స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తప్పనిసరి ఉండాలని మోటారు వెహికిల్ ఇన్‌స్పెక్టర్(ఎంవీఐ) శ్రీనివాస్ రావు పేర్కొన్నారు. శుక్రవారం అల్లాదుర్గంలోని పలు పాఠశాలలకు చెందిన బస్సులను తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని మూడు బస్సులను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా నడిపితే చర్యలు తప్పవన్నారు. పరిమితికి మించి వాహనాల్లో విద్యార్థులను తరలించకూడదని సూచించారు. బస్సుల కండిషన్, ఫస్ట్ ఎయిడ్ బాక్సులు, ఇన్సూరెన్స్, పర్మిట్, అటెండర్ లేని బస్సులపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఆయన వెంట ఎస్ఐ శంకర్,సిబ్బంది ఉన్నారు.




ప్రైవేటు బస్సుల పత్రాలను పరిశీలిస్తున్న దృశ్యం

### రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

పాపన్నపేట,జూన్ 20: వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు తప్పకుండా పాటించాలని ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్, ఏఎంవీఐ శ్రీనివాస్‌రావు అన్నారు. మండలంలోని ప్రైవేటు పాఠశాలల బస్సులు తనిఖీ చేశారు. నార్సింగి, పాపన్నపేట కలిపి మొత్తం ఐదు బస్సులను తనిఖీ చేసి ధ్రువపత్రాలను పరిశీలించారు. నిబంధనల ప్రకారం అన్ని పత్రాలను సరిగా ఉంచుకోవాలన్నారు. డ్రైవర్లకు పలు సూచనలు చేశారు.

### సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



పెద్దశంకరంపేట, జూన్20: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్ అన్నారు. శుక్రవారం పెద్దశంకరంపేట పోలీస్‌స్టేషన్‌లో సైబర్ క్రైం వారికి సంబంధించిన జాగ్రత్తల గురించి పోస్టర్ ఆవిష్కరించారు. సైబర్ క్రైం నేరాల నుంచి ప్రజలు మోసపోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి, అల్లాదుర్గం, పేట ఎస్ఐలు శంకర్, ప్రవీణ్‌రెడ్డి, తదితరులున్నారు.

**శివ్వంపేటలో..**

శివ్వంపేట, జూన్ 20: సైబర్ మోసాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్సై మధుకర్‌రెడ్డి అన్నారు. గోడపత్రికను ఆవిష్కరించారు. ముఖ్యమైన కూడళ్ల వద్ద గోడపత్రికలు అతికించారు. సైబర్ నేరాలకు గురైతే 1930కు కాల్‌చేయాలని, లేనిపక్షంలో స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు.

# విధుల్లో నిర్లక్ష్యం వహించిన సీసీ సస్పెన్షన్


**- బ్యాంకు అధికారులపై చర్యలు కరువు**

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

పాపన్నపేట, జూన్ 20: డ్వాక్రా సంఘాల నిధులు స్వాహా అనే శీర్షిక మే15న నమస్తే తెలంగాణ దిన పత్రికలో ప్రచురించిన ఇన్వెస్టిగేషన్ స్టోరీకి సంబంధిత అధికారులు స్పందించారు. నెల రోజులకు పైగా విచారణ జరిపారు. మహిళా సంఘాలకు సంబంధించిన రూ,39,92,141 నిధులను వీవోఏ పద్మ స్వాహా చేసినట్లు తేల్చారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన సీసీ సాయిలును సస్పెండ్ చేస్తూ డీఆర్డీవో శ్రీనివాస్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ గోల్‌మాల్‌లో బ్యాంకు అధికారుల పాత్ర సైతం ఉన్నట్లు పెద్ద ఎత్తున ఆరోపణలు ఉన్నాయి. అయినప్పటికీ చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. పాపన్నపేట మండలం పొడ్చాన్‌పల్లిలో జరిగిన సంఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలో 39 గ్రూపులు ఉన్నాయి. యూకో బ్యాంకు ద్వారా రుణాలు ఇస్తున్నారు. ఇందులో గ్రామ సంఘం, బ్యాంకు ద్వారా రెండు రకాల రుణాలు పొందవచ్చు. అయితే గ్రామ సంఘం నుంచి తీసుకునే రుణాలు అధ్యక్షురాలు, కార్యదర్శి, కోశాధికారి సంతకాలతో తీర్మానం చేసి రుణాలు తీసుకోవాలి. కానీ వారి సంతకాలను ఫోర్జరీ చేసి, సభ్యులకు తెలియకుండా గ్రామ వీవోఏ పద్మ రూ.26.50లక్షలు సొంత అకౌంట్లోకి మళ్లించుకున్నట్లు డీపీఎం ప్రకాశ్ తెలిపారు. ఇందులో అప్పటి బ్యాంకు అధికారుల పాత్ర ఉన్నట్లు తెలిసింది. బ్యాంకు నుంచి మహిళా సంఘాల సభ్యులకు ఇచ్చే రుణాలు సైతం నేరుగా వీవోఏ అకౌంట్లో జమ అయినట్లు తెలిసింది. ఇవి సుమారు రూ,13.40 లక్షల వరకు ఉన్నట్లు తేలింది. వీవోఏ ఈ విషయాలు బయటపడకుండా దొంగ రసీదులు, తీర్మానాలు, సంతకాల ఫోర్జరీ చేసి రికార్డులు నిర్వహించినట్లు సమాచారం. సీసీ నిర్లక్ష్యంతో ఈ అవినీతి బాగోతం బయటపడలేదని భావించిన అధికారులు సీసీ సాయిలుపై సస్పెన్షన్ వేటు వేశారు. మహిళా సభ్యుల వ్యక్తిగత అకౌంట్లోకి వేయాల్సిన రుణాలను అప్పటి బ్యాంకు అధికారి, వీవోఏతో కుమ్మక్కయి ఆమె సొంత అకౌంట్లోకి మళ్లించారన్న ఆరోపణలున్నాయి. ఈ విషయమై బ్యాంకు అధికారులు సైతం శాఖాపరమైన విచారణ జరుపుతున్నట్లు సమాచారం. సుమారు 35 రోజులు దాటినా వారి విచారణ కొలిక్కి రాకపోవడం గమనార్హం. అయితే తమ వద్ద ఏపీఎం సాయిలు, సీసీ సాయిలు పెద్ద ఎత్తున డబ్బులు తీసుకున్నారని ఏపీఎం సాయిలుపై కూడా చర్యలు తీసుకోవాల్సిందిగా సంబంధిత అధికారులను ఆమె కోరారు.

### కాంగ్రెస్ సీనియర్ కార్యకర్త అని చెప్పుకోవడానికి సిగ్గుగా ఉంది

**-ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో పేరు రాలేదని కుమ్మరి నరేశ్ ఆవేదన**



ఇల్లు కూల్చివేసిన ఖాళీ స్థలాన్ని చూపిస్తున్న కుమ్మరి నరేశ్

నర్సాపూర్, జూన్20: కాంగ్రెస్ సీనియర్ కార్యకర్త అయినప్పటికీ తనకు ఇల్లు రాకపోవడం సిగ్గుచేటుగా ఉన్నదని బాధితుడు నర్సాపూర్ మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన కుమ్మరి నరేశ్ వాపోయాడు. కాంగ్రెస్ కార్యకర్త అయినా తనకే ఇల్లు మంజూరు కాకపోతే పేదల పరిస్థితి ఏమిటని అసహనం వ్యక్తం చేశాడు. ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులు వారికి నచ్చిన, అనుకూలమైన వారికి ఇండ్లను మంజూరు చేయించారని ఆరోపించాడు. ఇందిరమ్మ కమిటీలో ఉన్న కాంగ్రెస్ కార్యకర్త ఇల్లుకు దరఖాస్తు చేసుకున్నాడని, తన ఇల్లును కూలగొట్టుకున్నాక, అతడికి ఇల్లు మంజూరు చేశారని ఆరోపించాడు. ఇప్పటికైనా అధికారులు, కాంగ్రెస్ నాయకులు స్పందించి తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయించి న్యాయం చేయాలని కోరాడు.

### ఇందిరమ్మ ఇండ్ల పేరిట కాంగ్రెస్ రాజకీయం

**బీఆర్‌ఎస్ చేగుంట పట్టణ అధ్యక్షుడు ఎర్ర యాదగిరి**



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎర్ర యాదగిరి

చేగుంట, జూన్20: ఇందిరమ్మ ఇండ్ల పేరిట కాంగ్రెస్ నాయకులు రాజకీయం చేస్తున్నారని బీఆర్‌ఎస్ చేగుంట పట్టణ అధ్యక్షుడు ఎర్ర యాదగిరి విమర్శించారు. చేగుంటలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యేను పక్కన పెట్టి నియోజకవర్గ ఇన్‌చార్జిలతో ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు పంపిణీ చేయడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని ధ్వజమెత్తారు. అధికారంలో తమ ప్రభుత్వం ఉన్నదని, ఇష్టానుసారంగా వ్యవహరించడం కాంగ్రెస్ నాయకులకు సరికాదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులకు తగిన గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. కార్యక్రమంలో టెలికాం బోర్డు మాజీ సభ్యుడు సోమ సత్యనారాయణ, కుర్రా లక్ష్మీనారాయణ, జర్నల్‌సింగ్, పొట్టి బాబు, కామారపు ఆంజనేయులు, మురాడి లక్ష్మణ్,సంద్రుగు నర్సింహులు, దుర్గి నర్సింహులు, సురేశ్‌సింగ్, వల్ప అనిల్, గొల్ల స్వామి ఉన్నారు.

### మత్తు పదార్థాలు తరలిస్తే కఠిన చర్యలు

చిలిపిచెడ్, జూన్ 20: గంజాయి, మత్తు పదార్థాలను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుటామని ఎస్సై నర్సింహులు తెలిపారు. శుక్రవారం చండూర్ చౌరస్తా వద్ద సిబ్బందితో వాహనాలు తనిఖీ చేశారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని తెలిపారు. ఆయనతో సిబ్బంది దుర్గాప్రసాద్, సతీశ్, సత్యం ఉన్నారు.

### నర్సాపూర్ మార్కెట్‌లో అంగన్‌వాడీ మేళా



నర్సాపూర్ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ మేళా

నర్సాపూర్, జూన్20: పట్టణంలోని కూరగాయల మార్కెట్‌లో శుక్రవారం అంగన్‌వాడీ మేళా ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా సీడీపీవో హేమభార్గవి మాట్లాడుతూ రెండున్నర ఏండ్ల నుంచి ఐదేండ్ల లోపు పిల్లలందరి పేర్లు అంగన్‌వాడీ కేంద్రంలో నమోదు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు కవిత, సరళకుమారి, లక్ష్మీనరసమ్మ పాల్గొన్నారు.

### వ్యక్తి అదృశ్యం



యూసుఫ్ (ఫైల్)

శివ్వంపేట, జూన్ 20: వ్యక్తి అదృశ్యమైన ఘటన శివ్వంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై మధుకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పాంబండ గ్రామానికి చెందిన ఎండీ యూసూఫ్ నర్సాపూర్ బస్టాండ్‌లో పూలషాపులో కూలిపని చేసేవాడు. ఈ నెల 18న పనికి వెళ్లిన యూసూఫ్ ఇంటికి రాలేదు. కుటుంబీకులు ఫోన్ చేసినా స్విచాఫ్ రావడంతో బంధువుల వద్ద ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. దీంతో అతడి భార్య ఆఫ్రిన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

### సమాజంలో భక్తిభావం కలిగి ఉండాలి



రామాలయంలో భక్తులతో పీఠాధిపతులు

రామాయంపేట, జూన్ 20: ప్రస్తుత సమాజంలో ప్రతిఒక్కరూ భక్తి భావం కలిగి ఉండాలని, అప్పుడే మనిషికి భగవంతుడి ఆశీస్సులు ఉంటాయని రంగంపేట ఆశ్రమ పీఠాధిపతి మాధవానంద సరస్వతీ స్వామిజీ అన్నారు. శుక్రవారం రాయిలాపూర్‌లోని సీతారామ చంద్ర స్వామి ఆలయంలో స్వామికి అభిషేకాలు చేశారు. అనంతరం శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట అర్చకులు రాంమోహన్ శర్మ, లక్ష్మణమూర్తి ఉన్నారు.

### ప్రతిభ కనబర్చిన విద్యార్థినులకు ఆర్థిక సాయం



నగదును అందజేస్తున్న ఎస్‌సీఎస్ ట్రస్ట్ నిర్వాహకురాలు

మెదక్ మున్సిపాలిటీ, జూన్ 20: పదో తరగతిలో ప్రతిభ కనబర్చిన జిల్లా కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లోని ఐదుగురు విద్యార్థినులకు హైదరాబాద్‌కు చెందిన ఎస్‌సీఎస్ ట్రస్ట్ నిర్వాహకురాలు భారతి ఒక్కొక్కరికి రూ.20 వేల చొప్పున నగదును శుక్రవారం అందజేశారు. జిల్లా విద్యాశాఖధికారులతో పాటు ప్రధానోపాధ్యాయురాలు రేఖ, ఉపాధ్యాయ సంఘ నేతలు పాల్గొన్నారు.

### బగలాముఖి శక్తిపీఠంలో అక్షరాభ్యాసం



శివ్వంపేట, జూన్ 20: శివ్వంపేటలోని బగలాముఖి శక్తిపీఠంలో అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు బ్రహ్మశ్రీ శాస్త్రుల వెంకటేశ్వర శర్మ ఆధ్వర్యంలో శుక్రవారం అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో మండల సూపర్‌వైజర్ సంతోష, అంగన్‌వాడీ టీచర్లు కృష్ణ, నవీన, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### పంచాయతీ కార్మికుల సమ్మె నోటీస్

నర్సాపూర్, జూన్20: జూలై 9న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెలో పాల్గొంటామని గ్రామ పంచాయతీ కార్మికులు శుక్రవారం ఎంపీడీవో కార్యాలయ సిబ్బందికి సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కడారి నాగరాజు ఆధ్వర్యంలో సమ్మె నోటీసులు అందించారు.

### రోడ్డును బాగు చేయించాలని ధర్నా

నర్సాపూర్,జూన్20: రోడ్డు బాగుచేయించాలని బీజేపీ నాయకులు జాతీయ రహదారిపై బైఠాయించారు. కొండాపూర్, కాగజ్‌మద్దూర్, నత్నాయిపల్లి గ్రామాలకు వెళ్లే రహదారి శిథిలావస్థకు చేరిందని విన్నవించుకున్నా చర్యలు తీసుకోవడం లేదని నిరసన తెలిపారు. నాయకులు రమేశ్‌గౌడ్, నగేశ్, శంకర్, రాంరెడ్డి పాల్గొన్నారు.